క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ


మాట్లాడుతున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మద్దిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు శానిటరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రోజువారీ పనుల్లో భాగంగా పారిశుధ్య సిబ్బందికి కావాల్సిన గ్లౌజులు, చీపుర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మౌలిక వసతుల్లో పారిశుధ్యం ముఖ్యమైనదన్నారు. పారిశుధ్య సిబ్బంది విధినిర్వహణలో భాగంగా వార్డు పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ఈ కార్యక్రమం లో భట్టరాజుల డెవలప్‌మెంట్ డైరెక్టర్ నిడిమోళి రవికుమార్, కర్రిరామిరెడ్డి, వార్డుయూత్ అధ్యక్షుడు సుధాకర్, వెంకటరావు, మున్నా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ,సచివాలయ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే


మాట్లాడుతున్న యాదగిరిరెడ్డి

సీతంపేట: గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో ప్రపంచ టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. టైలరింగ్ మెషీన్ సృష్టికర్త ఐజాక్ మెరిట్ సింగర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. సొసైటీ అధ్యక్షుడు సి.హెచ్. యాదిగిరిరెడ్డి మాట్లాడుతూ రెడీమేడ్ రంగం విస్తరించడంతో దర్జీల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. టైలరింగ్ సొసైటీకి సామాజిక భవనం మంజూరు చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సొసైటీలో 150 షాపులకు సంబంధించి వెయ్యి మంది సభ్యులు ఉన్నారని, తామందరినీ ప్రభుత్వం గుర్తించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా సహకారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సీహెచ్ వేణు, కోశాధికారి సీహెచ్ తిరుపతిరావు, సభ్యులు ఇషాక్ బాబా, అధిక సంఖ్యలో టైలర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య రాకుండా చూడండి


పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, నూనె పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: వార్డులో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి రాజేంద్రనగర్‌లోని వార్డు కార్యాలయంలో మంగళవారం సబ్బులు, కొబ్బరినూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో అమలు చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సింహాచలం నాయుడు, శానిటేషన్ సెక్రటరీ తేజ, సూపర్ వైజర్లు ఈశ్వరరావు, రాము, సిబ్బంది అన్నపూర్ణమ్మ, రామారావు, సత్యవతి. పరమేశ్వరి పాల్గొన్నారు.

డాక్టర్ వరప్రసాద్‌కు జాతీయ అవార్డు



కంచరపాలెం: కంచరపాలేనికి చెందిన డాక్టర్ మాముడూరి వరప్రసాద్‌కు మధ్యప్రదేశ్‌లోని సోషియల్ పాయింట్ ఫౌండేషన్ చైర్మన్ అభిషేక్ చేతుల మీదుగా 2022–23 సేవలకు గుర్తింపుగా 'భారత్ భూషణ్' అవార్డు అందుకున్నారు. సామాజిక, రాజకీయ రంగాల్లో ఉత్తమ సేవలకు గానూ ఈ అవార్డు అందుకున్నట్టు డాక్టర్ వరప్రసాద్ తెలిపారు.

నత్తే నయం

- కొనసాగుతున్న రహదారి పనులు
- ఇబ్బంది పడుతున్న సత్యసాయినగర్‌వాసులు


రాళ్లు తేలిన రహదారి


సత్యసాయినగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు కాలనీలైన వరాహగిరి కాలనీ-1, సత్యసాయినగర్‌లో 24గంటల మంచినీటి పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడేళ్ల క్రితం ప్రారంభమైన పనులు ఆగుతూ సాగుతూ జరుగుతున్నాయి. మూడు నెలలు ప్రారంభించిన పనులు మళ్లీ నిలిపివేశారు. ఇలా అసంపూర్తి పనులు కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే చిన్న రోడ్లు, ఆ రోడ్లను కూడా తవ్వేశారు. దీంతో అన్ని వీధులు గతుకులమయంగా మారాయి. ప్రధాన రహదారి నుంచి ఈ కాలనీలకు వెళ్లే మెయిన్‌రోడ్, సమీప వీధుల్లో పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. సుమారు రెండేళ్ల తరువాత ఈ ప్రాంతంలో మంచినీటి పైపులైన్‌ల కోసం పనులు ప్రారంభించారు. అప్పట్లో భూమి కింద నుంచి పెద్దపైపులను వేశారు. అప్పటి నుంచి మిగిలిన పనులను అసంపూర్తిగా వదిలేశారు.

పనులు పూర్తి చేయాలి



మంచినీటి పైప్‌లైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అసంపూర్తిగా పనులు వదిలేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలి

–కారుకొండ రాజు, సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు

మూడేళ్ల నుంచి పీడిస్తున్న సమస్య



సుమారు మూడేళ్ల నుంచి కాలనీలలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. మంచినీటి పైప్‌లైన్ కోసం రోడ్లను తవ్వారు. పైపులు వేశారు. కానీ తవ్విన రహదారులను మెరుగుపరచలేదు. ఈ మధ్య తిరిగి పనులు ప్రారంభించి కొన్ని రోడ్లు వేశారు. మళ్లీ ఆపేశారు. దీంతో పిల్లలు, వృద్ధులు రాత్రి వేళల్లో ఈ రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నారు.

–మళ్ల భాస్కరలక్ష్మి, సత్యసాయినగర్

24/7 తాగునీటి సరఫరాకు పైపులైన్


నందగిరినగర్‌లో పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు పరిధిలో నందగిరినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతవాసుల తాగునీటి కష్టాలు త్వరలో తీరినట్టే. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు పనిచెయ్యక వేసవిలో నీటి ఎద్దడితో గత ఏడేళ్లుగా జనం ఇబ్బంది పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు తీరేలా ప్రజాప్రతినిధుల చొరవతో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 24/7 నీటి సరఫరాకు ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం నందగిరినగర్‌లో పైపులు వేస్తున్నారు. వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ నందగిరినగర్‌లో జరుగుతున్న 24/7 పైపులైన్ పనులను పర్యవేక్షించారు. ఆసియా బ్యాంకు నిధులతో షాదీఖానా వద్ద నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నందగిరినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాలకు 24/7 తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు.

ఐఐపీఈతో ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐఐపీఈ డైరెక్టర్, ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాధికా చౌదరి

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) క్యాంపస్‌లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఐఐపీఈ విద్యార్థులకు ప్రస్తుత పరిస్థితిలో సైన్స్ ప్రాధాన్యం, అవసరం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్ విధి విధానాలు, సాధించిన విజయాల గురించి ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ డైరెక్టర్ రాధికా చౌదరి, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన ఒప్పంద పత్రాలు అందజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ డీన్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

కళాకారులకు పురస్కారాలు


స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళాపరిషత్ సంయుక్తంగా స్థానిక పౌరగ్రంథాలయంలో నందమూరి శతజయంతి వేడుకల నెలవారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ నెల కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర కళాకారులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. డీటీఎస్ ఆనంద మిమిక్రీ, చందు జాంగ్లింగ్ షో, శ్రీనివాస్ జానపద గీతాలు, మల్లిక, రామారావు, భాస్కర్లచే కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను మెప్పించాయి. అనంతరం వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి అతిథులుగా విచ్చేసిన సామాజిక విశ్లేషకులు సన్‌మూర్తి, శంఖారావం సంస్థ అధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఎన్టీఆర్ పురస్కారాలతో సత్కరించారు. డాక్టర్ కందుకూరి విజయమోహనరావు, నమ్మి అప్పలరాజుయాదవ్, దొరబాబు, రామకృష్ణ, మల్ల అప్పారావు, టి.ఎస్.ఆనంద్ వరప్రసాద్, కరకవలస కృష్ణమూర్తి, జి.ఎస్.ఎన్.మూర్తి, రాము, కోరాడ నారాయణరావు, జగదీష్ ఎన్టీఆర్ పురస్కారాలు అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకులు పి.ఎ. భాస్కరరావు, కార్యదర్శి మల్లిక పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో అడవిరాజు, భాస్కర్ పలువురు కళాకారులు పాల్గొన్నారు.

సీతారామాచార్యులకు ఘన సత్కారం


సీతారామాచార్యులను సత్కరిస్తున్న శృతిలయ సంస్థ ప్రతినిధులు

సీతంపేట: సింహాచలం దేవస్థానం పురోహితులు కర్రి సీతారామాచార్యులను శృతిలయ సాంస్కృతిక సంస్థ మంగళవారం సాయంత్రం ఘనంగా సత్కరించింది. శృతిలయ సాంస్కృతిక సంస్థ ఇటీవల సీతమ్మధారలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణం విజయవంతమైన సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అభినందన సభ నిర్వహించారు. కల్యాణానికి సహకరించిన దాతలు, సేవకులను సత్కరించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఆగమ సంప్రదాయాలపై జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన సదస్సులో శ్రీపాంచరాత్ర ఆగమ సంప్రదాయంపై ప్రసంగించి ప్రముఖుల అభినందనలు అందుకున్న సింహాచలం దేవస్థానం పురోహితులు సీతారామాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శృతిలయ సంస్థ వి.ప్రభాకర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, పి. రంగనాథాచార్యులు, కొణతాల రాజు, సీహెచ్‌వీ సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, వి.ఫణీంద్ర పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ప్రచారం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు


49వ వార్డులో పట్టభద్రులకు కరపత్రాన్ని అందజేస్తున్న అల్లు శంకరరావు


కరపత్రాన్ని అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

మద్దిపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారం జోరుగా కొనసాగుతోంది. 49వ వార్డు డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకట రమణ ఆధ్వర్యంలో 283 సచివాలయం పరిధి పట్టాభిరెడ్డి తోట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో భట్టరాజుల డెవలప్‌మెంట్ డైరెక్టర్ నిడుమోళి రవికుమార్, కర్రి రామిరెడ్డి, వార్డు యూత్ అధ్యక్షుడు సుధాకర్, వెంకటరావు, మున్నా పాల్గొన్నారు.

51వ వార్డులో..

291 సచివాలయం పరిధి మాధవస్వామి కల్యాణ మండపం, విద్యానగర్, శంకర్ నగర్, కళింగనగర్, వుడా క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజుతో కలిసి వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మంగళవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పైడి శ్రీను,పైడి ప్రతాప్, మెట్ట దమయంతి, శ్యామ్, వై.వరలక్ష్మి, లత, ధర్మవతి, గణేష్, ధర్మేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

కేకే రాజు ప్రచారం

సీతమ్మధార : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం 14 వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని రామేర్ స్టాఫ్, రసపూర్ణ ఫుడ్ సంస్థ ఆఫీస్‌లో వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజుతో కలిసి ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 26 వార్డు ఇంచార్జి వెంకటలక్ష్మి, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కిరణ్‌రాజు, ప్రభాకర్ వర్మ పాల్గొన్నారు.

సీతంరాజు విజయమే లక్ష్యం

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం పరిధిలో కస్తూరినగర్, శాంతినగర్ ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్, వార్డు కార్పొరేటర్ కటుమూరి సతీష్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వార్డులో ప్రచారం నిర్వహించారు. ముందుగా లక్ష్మీనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.అప్పారావు, బి.గోవింద్, కృష్ణ, రామారావు, ఈశ్వరరావు, శ్రీను, అప్పలరెడ్డి, రమణ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

42వ వార్డులో ..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు పరిధి జగన్నాథపురం, శివాలయంవీధి, రామాలయం వీధిలో వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు షేక్ జుబేర్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ నేతలు ఆళ్ల శ్రీనివాస్, వెంకటేష్, పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు


నడక పోటీల్లో పాల్గొన్న మహిళలు

మురళీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీ నగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం మహిళలకు నడక, క్విజ్ పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. నడకపోటీలను వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య ప్రారంభించారు. నడక పోటీలు ఐదు విభాగాలుగా నిర్వహించారు. మ్యూజికల్ చైర్, క్విజ్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 8వ తేదీన బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షురాలు సీహెచ్. వరలక్ష్మి, లీలానాయుడు, ఓం వాకర్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, వైభవ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.దుర్గా ప్రసన్న పాల్గొన్నారు.

అటు నేహ..ఇటు అనసూయ

- పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవంలో మెరిసిన తారలు
- తన గళంతో ఆకట్టుకున్న మోహన్ భోగరాజు


కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న బుల్లితెర బ్యూటీ అనసూయ

సబ్బవరం: ఉదయం భక్తులతో ఆ ప్రాంగణం పులకించింది..సాయంత్రం సెలబ్రిటీలతో సందడి నెలకుంది. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా..బుల్లితెర బ్యూటీ అనసూయ కిరాక్ పుట్టించింది. బుల్లెట్ బండీ సింగర్ మోహన్ భోగరాజు తన గళంతో ఈవెంట్‌ను తారాస్థాయికి తీసుకువెళ్లారు. జబర్దస్త్ యాంకర్ సౌమ్యరావు తన మాటలతో ఆకట్టుకున్నారు. మండలంలోని తవ్వవాని పాలెంవాసుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండగ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన గుర్రపు పందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. అనుపు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ మందుగుండు పోటీలు మిరమిట్లు గొలిపాయి. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంతో పాటు రాకెట్ రాఘవ టీమ్‌తో పాటు పలువురు వెండి, బుల్లితెర నటులు సందడి చేశారు.

అబ్బురపరిచిన సైన్స్ ప్రదర్శనలు


విద్యార్థులు తయారు చేసి ప్రాజెక్టులు


ప్రాజెక్టు నమూనాలతో విద్యార్థులు


అక్కయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో నమూనాలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: సైన్స్ డే సందర్భంగా అక్కయ్యపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన అబ్బురపర్చింది. విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలు వారిలోని ప్రతిభను, ఆలోచనా శక్తికి అద్దం పట్టాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆశాదేవి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, లలితాంబ, గౌసియా బేగం, మాధురి పాల్గొన్నారు.

జ్ఞాననికేతన్‌లో...

లలితానగర్‌లోని జ్ఞాననికేతన్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన ఆలోచింపజేసింది. 6 నుంచి 10 తరగతి విద్యార్థులు పలు నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. అవి ఎలా పనిచేస్తాయో వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ సునీతా కుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సహచర విద్యార్థులు నమూనాలు తిలకించారు.

ఎస్ఎంసీహెచ్ పాఠశాలలో...

సీతమ్మధార : జీవీఎంసీ 24 వార్డులోని ఎస్ఎంసీహెచ్ పాఠశాల్లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఆరో తరగతినుంచి పదో తరగతి విద్యార్థులు 50 ప్రాజెక్టులు ప్రదర్శించారు.

సృజనాత్మకతతోనే పరిశోధనావకాశాలు

మురళీనగర్: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను వెలికితీసినప్పుడే పరిశోధనాత్మక అవకాశాలు లభిస్తాయని అల్లూరి సీతారామరాజునగర్‌లోని కే.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి అన్నారు. జాతీయ విద్యావైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశ్నించడం, పరిశీలించడం, సమస్యలను కనుగొని వాటికి పరిష్కార మార్గాలను ఎంచుకోవడంలోనే పరిశోధనాత్మక భావనలు ఇమిడి ఉన్నాయని ఆమె వివరించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు శ్రీధర్, ప్రశాంతి, నరసింగరావు, రాజాబాబు, పద్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నమూనాలు

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు శ్రీముఖ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భౌతిక రసాయనిక, శాస్త్రాలకు, జీవశాస్త్రాలకు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి చిన్నారులు రూపొందించిన పలు నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎం.డి.దస్తగిరి, ఉపాధ్యాయులు అరుణ కుమారి పర్యవేక్షించారు.

సమాజ హితం కోరేవారిగా ఎదగాలి

తాటిచెట్లపాలెం : విద్యార్థులు పర్యావరణం, సమాజ హితం కోరే వారిగా ఎదగాలని నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య వి. బాలమోహన్ దాస్ తెలిపారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా చైల్డ్ రైట్స్ అండ్ యూ (క్రై) సహకారంతో ధరణి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ హైస్కూల్, కేఎస్ఎం బాలికల హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంటర్ స్కూల్స్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడేవిగా ఉండాలని తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో ప్రభుత్వ రైల్వే స్కూల్, జీవీఎంసీ ఆర్‌పీ పేట స్కూల్, జీవీఎంసీ రైల్వే న్యూకాలనీ హైస్కూల్, కేఎస్ఎం బాలికల హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన పలు నమూనాలను ప్రదర్శించారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, డిజిటల్ విద్య ప్రాధాన్యత, మెదడు పని చేసే విధానం, గ్యాస్ అలార్మింగ్, సోలార్ ఎనర్జీ వంటి పలు వినూత్న ఆవిష్కరణలు విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి, జీవీఎంసీ హైస్కూల్, రైల్వేన్యూకాలనీ హెచ్ఎం జి.సన్యాసిరావు, కేఎస్ఎం హైస్కూల్ హెచ్ఎం కె.రాము, ధరణి సంస్థ ప్రతినిధులు లీలావతి, కృష్ణకుమారి, సాయిలక్ష్మి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కంచరపాలెం: సైన్స్ ప్రాధాన్యత విపరీతంగా పెరిగి పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు తమలోని సృజనను వెలికితీసేలా ఎన్నో ప్రయోగాలు చేపడుతున్నారని శ్రీమణి ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌కె.రత్నం అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ డే ను పురస్కరించుకుని వృకృత్వ, వ్యాస రచన క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల అందజేశారు.